సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

శుక్రవారం, 17, అక్టోబర్, 2025



పేద విద్యార్థులకు అన్యాయం
రాష్ట్రంలోని 17 మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తే పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. -IIలో



ఆత్మహత్యలను ఆపి..
ఎర్రగుంట్ల రైల్వే పోలీసుల చొరవతో ఇద్దరి నిండు ప్రాణాలు నిలిచాయి.ఆత్మహత్య చేసుకోవాలని రైలు పట్టాలపైకి రాగా వారిని కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. -IIలో

గరిష్టం/కనిష్టం
30.0/24.9

వాతావరణం
జిల్లాలో గురువారం 24.9 - 30.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

18న స్కేటింగ్ ఎంపికలు
కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 18న జిల్లా స్కేటింగ్ ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా ది రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఇస్రాయిల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలు యోగి వేమన యూనివర్శిటీ, డీఎస్‌ఏ స్టేడియంలో జరుగుతాయన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు 37వ అంతర్ జిల్లాల రోలర్ స్కేటింగ్ పోటీలు నవంబర్ 1 నుంచి 5 వరకు కాకినాడలో జరిగే పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

నేడు జాబ్ మేళా
ప్రొద్దుటూరు: స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ, ప్రిన్సిపల్ శారద భవాని ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి డిగ్రీ, బీటెక్, ఐటీఐ, డిప్లమో చదివిన విద్యార్థులకు గ్రీన్‌టెక్, హెటిరో డ్రగ్స్, రెడ్డీస్ ఫౌండేషన్, అపోలో ఫార్మసీ, ముత్తూట్ ఫైనాన్స్, జాన్‌డీర్, ఎస్‌బీఐ కార్డ్స్.. మొత్తం 20 కంపెనీలలో ఉద్యోగాలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వారు వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 6301225355 సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స చేయాలి
కడప రూరల్: ఆర్‌ఎంపీలు తమ వద్దకు వచ్చే రోగులకు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. అనారోగ్యంతో వచ్చేవారికి ఆర్‌ఎంపీలు ఇంజక్షన్లు వేయరాదు, సెలైన్ బాటిల్స్ పెట్టకూడదు, మందులు ఇవ్వకూడదు, రక్త పరీక్షలు చేయకూడదని పేర్కొన్నారు. కేవలం ప్రథమ చికిత్సను మాత్రమే చేసి, సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెఫర్ చేయాలని తెలిపారు. నిబంధనలను అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడంతోపాటు, సీజ్ చేస్తామని హెచ్చరించారు. ప్రజలు మెరుగైన వైద్య సేవల కోసం అర్హులైన డాక్టర్ల వద్ద చికిత్స చేయించుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం


మాట్లాడుతున్న వీర్రాజు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనలో భాగంగా జిల్లాలో గల యువకులకు నైపుణ్యాలతో కూడిన డ్రైవింగ్ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయంతో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ వీర్రాజు పేర్కొన్నారు. గురువారం నగర శివార్లలోని ఊటుకూరు జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందులో భాగంగా ప్రతి 10 లక్షల జనాభాకు ఒక డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ చొప్పున శాంక్షన్ చేయడానికి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయడానికి ఆసక్తి కల అభ్యర్థులు ఈ నెల 23 సాయంత్రం 5 లోపు వారి ఆసక్తి పత్రాలను, డీపీఆర్ కాపీలను, ఇతర అటాచ్‌మెంట్లను జిల్లా ఉప రవాణా కమిషనర్ కార్యాలయము, వైయస్సార్ కడప జిల్లా లో సబ్మిట్ చేయాలని కోరారు. ఆసక్తి గల సంస్థలు పూర్తి వివరాలు కోసం కేంద్ర రహదారులు , రవాణా శాఖ వెబ్‌సైట్‌లో నుండి పూర్తి వివరాలు పొందవచ్చన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలకే తొలి ప్రాధాన్యత


మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ అడపాల లక్ష్మీతులసి

రాజంపేట టౌన్ : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ తొలి ప్రాధాన్యత అని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కడప రీజియన్ హెడ్ అడపాల లక్ష్మీతులసి తెలిపారు. పట్టణంలోని అమ్మవారిశాల వద్ద ఉన్న యూనియన్ బ్యాంక్‌ను ఆర్‌ఎస్‌రోడ్డులోని చేజెర్ల కాంప్లెక్స్‌లోకి గురువారం మార్పు చేసిన సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ అన్ని రకాల సాంకేతిక సేవలు ఖాతాదారులకు అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. తిరుపతి రీజియన్ హెడ్ శ్రీనివాసకుమార్ మాట్లాడుతూ ఖాతాదారులు సైబర్ నేరాల పట్ల చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. రకరకాల లింక్‌లు సెల్‌ఫోన్‌కు వస్తుంటాయని అయితే కొత్తవారు పంపే లింక్‌లను ఎట్టిపరిస్థితుల్లో ఓపెన్ చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు మొగిలీశ్వర, వంశీకృష్ణ, ధనుంజయ, అబ్దుల్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ముంగిట్లో.. అసమ్మతి మంటలు!

- సీనియర్లు లేదు... తొక్క లేదు... వాసు మాటలపై మండిపాటు
- మొన్న దేవుని కడప వేదికగా తెలుగుతమ్ముళ్లు ఆరోపణలు
- నేడు పెద్దదర్గాలో ముస్లిం మైనార్టీ నాయకులు నిలదీత
- అసమ్మతి నేతల్ని చేరదీస్తున్న కమలాపురం నేత పుత్తా నరసింహ రెడ్డి
- కడప, కమలాపురం ఎమ్మెల్యేల మధ్య రగులుతున్న మంటలు


ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు

సాక్షి ప్రతినిధి, కడప: కడప తెలుగుదేశం పార్టీలో అసమ్మతి మంటలు ఎక్కువయ్యాయి. ముఖ్యంగా కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డికి వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. ఎమ్మెల్యే దంపతుల ఒంటెత్తు పోకడలతో టీడీపీ నేతలు, కార్యకర్తలు క్రమం తప్పకుండా తిరుగుబావుటా ఎగురువేస్తున్నారు. ఇటీవల 'సీనియర్లు లేరు...తొక్కా లేద'న్న జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి వ్యాఖ్యలపై తెలుగుతమ్ముళ్లు మండిపడుతున్నారు. మొన్న దేవుని కడప వేదికగా ఎమ్మెల్యే దంపతులకు మంచి బుద్ధులు ప్రసాదించాలని నిరసన తెలిపిన తెలుగుతమ్ముళ్లు, తాజాగా పెద్ద దర్గా వేదికగా మరోమారు ఆరోపణలు గుప్పించారు. కడప అసమ్మతి నేతలకు కమలాపురం టీడీపీ నేత పుత్తా నరసింహారెడ్డి గాడ్‌ఫాదర్‌గా నిలుస్తుండడంతో అధికార పార్టీకి చెందిన కడప, కమలాపురం నేతల మధ్య విభేదాల మంటలు రగిలిపోతున్నాయి.

- కడపలో ఇరవై ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత టీడీపీ జెండా ఎగిరింది. ఈ గెలుపు వెనుక అనేక మంది కార్యకర్తల శ్రమ లేకపోలేదు. దీన్ని విస్మరించిన మాధవిరెడ్డి, వాసు దంపతులు తమ ఒక్కరిదే విజయమన్నట్లు.. ఒంటెద్దు పోకడలు పోతున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. దీంతో ఏడాది తిరక్కముందే వారి తీరుపై తీవ్రమైన అసంతృప్తులు వ్యక్తమవుతూ వచ్చాయి. ఈక్రమంలో మొన్న దేవుని కడప వేదికగా ఎమ్మెల్యే మాధవీరెడ్డి దంపతులకు మంచి బుద్ధులు ప్రసాదించాలని పాతకడప సింగిల్‌విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, చెన్నంశెట్టి మురళీకృష్ణ, దేవుని కడప శంకర్ తదతరుల నాయకత్వంలో శ్రీవేంకటేశ్వరస్వామికి విన్నవించారు. ఆపై కమలాపురం టీడీపీ నేత పుత్తా నరసింహారెడ్డి చెంతకు చేరి అండగా నిలవాలని కోరారు. అదే తరహాలో ముస్లిం మైనార్టీ నేతలు కూడా తెరపైకి వచ్చారు. సీనియర్లు లేరు...తోలు లేదు..తొక్కా లేదంటూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. పెద్దదర్గాలో ప్రార్థనలు అనంతరం పార్టీ కోసం ఎంతో శ్రమించిన వారిని కాదనీ, వారికి నచ్చిన వారికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆపై కమలాపురం టీడీపీ నేత పుత్తా ఇంటికి చేరుకొని అండగా నిలవాలంటూ అభ్యర్థించారు. త్వరలో మరి కొంత మంది క్రిస్టియన్ మైనార్టీలు సైతం మరియాపురం చర్చి నుంచి కూడా ఇలాగే బయలుదేరి వెళ్లి పుత్తాను కలవనున్నట్లు తెలుస్తోంది.

అధ్యక్ష పదవికి ఎసరు పెట్టే దిశగా అడుగులు...

టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి పదవికి ఎసరు పెట్టే దిశగా జిల్లా టీడీపీ నేతల అడుగులు పడుతున్నట్లు తెలుస్తోంది. కడప గడపలో ఎమ్మెల్యే దంపతుల పట్ల వ్యతిరేకత బూచిగా చూపిస్తూనే, పొలిట్‌బ్యూరో మెంబర్‌గా, జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసులరెడికి రెండు పదవులు ఉండడం, ఇతర నియోజకవర్గాల నాయకులతో సన్నిహిత సంబంధాలు తెగిపోవడం కూడా కారణాలుగా చెబుతోన్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో జిల్లా అధ్యక్షుడు మార్పు చేయాలంటూ తెరవెనుక మంత్రాంగం నడుస్తోన్నట్లు సమాచారం. ఆ మేరకు మధ్యేమార్గంగా జమ్మలమడుగు ఇన్‌ఛార్జీ భూపేష్‌రెడ్డికి కట్టబెట్టాలనే ప్రతిపాదన ఉన్నప్పటికీ, సీనియర్ నేతగా గుర్తింపు ఉన్న పుత్తా నరసింహారెడ్డికి అప్పగించాలనే డిమాండ్ తెరపైకి తెస్తున్నట్లు సమాచారం. ఆ మేరకు కడప నేతలతో వ్యూహాత్మక అడుగులు వేయిస్తున్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

కడప, కమలాపురం ఎమ్మెల్యేల మధ్య తీవ్రమైన వైరం






కడప, కమలాపురం ఎమ్మెల్యే మధ్య తీవ్రమైన వైరం నడుస్తోంది. జిల్లా కేంద్రానికి ప్రాతినిథ్యం వహిస్తున్నాం, మా ఆధిపత్యమే ఉండాలంటూ కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి పట్టుబడుతోంది. బ్రౌన్ లైబ్రరీ శిలాఫలకంలో కమలాపురం ఎమ్మెల్యే పేరు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. బిల్టప్ సమీపంలో పుత్తా వర్గీయులు మద్యంషాపు పెట్టుకోవడాన్ని కూడా వ్యతిరేకించారు. మౌర్య వైన్స్ మద్యం షాపుకు బాడుగకు ఇచ్చిన ఇంటికి కార్పొరేషన్ పర్మిషన్ లేదంటూ అధికారులను ఉసిగొల్పి చర్యలకు ఉపక్రమించారు. ఈపరిణామాన్ని టీడీపీ సీనియర్ నేత పుత్తా నరసింహారెడ్డి సీరియస్‌గా తీసుకున్నారు. కార్పొరేషన్ అధికారుల్ని నిర్బంధించి మిమ్మల్ని పంపించిన నాయకునికి చెప్పుకొండంటూ పరుష పదజాలంతో హెచ్చరికలు చేశారు. మరో వైపు పుత్తా ఎస్టేట్ డ్రైనేజీ కాలువ ఆక్రమణలకు పాల్పడ్డారంటూ కడప ఎమ్మెల్యే ఏకంగా ఆరోపణలు గుప్పించారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే కడప అసంతృప్తి నేతలకు అండగా పుత్తా నరసింహారెడ్డి నిలుస్తున్నారని పరిశీలకులు భావిస్తున్నారు. కడప సీనియర్ నేత ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డితో పుత్తా పూర్తి సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నారు. నగర మాజీ అధ్యక్షుడు శివకొండారెడ్డిపై దాడి చేస్తే పుత్తా నరసింహారెడ్డి పరామర్శించారు. పాత కడప కృష్ణారెడ్డి అండ్ టీమ్‌కు అండగా నిలిచారు. తాజాగా ముస్లీం మైనార్టీ నేతలకు భరోసా ఇచ్చారు. ఇటీవల కోటిరెడ్డి సర్కిల్ బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటును ఎమ్మెల్యే వర్గీయులు అడ్డుకుంటే పుత్తా వర్గీయులు అండగా నిలిచారు.

గండి టెండర్లలో కొన్నింటికి ఆమోదం
చక్రాయపేట: గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో గురువారం నిర్వహించిన టెండర్లలో కొన్నింటికి ఆమోదించి మరి కొన్నింటిని వాయిదా వేసినట్లు ఆలయ సహాయ కమీషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. టెండర్లలో ప్రధానమైన కొబ్బరికాయల విక్రయ హక్కుకు సంబంధించి పోటీదారులు ధరావత్తు మొత్తం చెల్లించినప్పటికీ పాట పాడేందుకు నిరాసక్తత కనబరిచారు.దీంతో కొబ్బరి కాయల టెండరును వాయిదా వేసినట్లు ప్రకటించారు.సప్లయర్స్ డెకరేషన్ సామాన్లు,విద్యుత్ ప్లంబింగ్ ఆమాగ్రి సరఫరా, స్టేషనరీ,అరటి ఆకుల,మామిడి తోరణములు, వస్త్రాల సరఫరా,తదితరాలను ఆమోదం తెలిపినట్లు చెప్పారు.పూలమాలల సరఫరా,పాదరక్షలు భద్రపరచు హక్కు,ని రుపయోగ సామగ్రి కొనుగోలు తదితరాలను వాయిదా వేశామని వివరించారు. కడప దేవదాయ శాఖ తనిఖీదారుడు శివయ్య,ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఏపీ ఎంఐపీ ఓఎస్‌డీ రమేష్

కడప అగ్రికల్చర్: ప్రభుత్వం నిర్దేశించిన సూక్ష్మ సేద్య అమలు లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ఎంఐపీ ఓఎస్‌డీ రమేష్ అధికారులను ఆదేశించారు. ఏపీ ఎంఐపీ ప్రగతిపై గురువారం కలెక్టర్ ప్రాంగణంలో అధికారులు, కంపెనీ ప్రతినిధులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాకు 13500 హెక్టార్ల లక్ష్యంగా ప్రభుత్వం సూక్ష్మ సేద్య అమలుకు నిర్ణయించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సర లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు.

24 నుంచి యువజన వారోత్సవాలు
కడప ఎడ్యుకేషన్: జిల్లా స్థాయి యువజనోత్సవాలు ఈ నెల 24వ తేదీన ఉదయం 10 గంటలకు కడపలోని స్పిరిట్స్ డిగ్రీ కళాశాలలో సెట్ప్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సెట్ప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఇండ్ల జోయెల్ విజయకుమార్ తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా పలు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల యువతీ యువకులు (15–29 వయస్సు) సన్నద్ధం కావాలన్నారు. వివరాలకు 9949298810 – 9849497011 నంబర్లలో ఆఫీసు పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

ప్రత్యక్ష రాజకీయాల్లోకి చవ్వా దుష్యంత్‌రెడ్డి



పులివెందుల: ప్రముఖ పారిశ్రామికవేత్త చవ్వా దుష్యంత్ రెడ్డి ప్రత్యక్ష రాజకీయాల్లోకి రానున్నట్లు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రకటించారు. దుష్యంత్‌రెడ్డి గతంలో కమలాపురం, జమ్మలమడుగు ప్రాంతాల్లో ఎన్నికల ఇన్‌చార్జిగా పనిచేశారు. గురువారం పులివెందులలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీకి సంబంధించి గత 30ఏళ్లుగా వైఎస్ మనోహర్‌రెడ్డి సేవలు అందించారని, ప్రస్తుతం ఆయన వయస్సు రీత్యా దుష్యంత్‌రెడ్డి మనోహర్‌రెడ్డికి తోడుగా పులివెందుల మున్సిపాలిటీలో సేవలందిస్తారన్నారు. పులివెందుల మున్సిపాలిటీ ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

సబ్సిడీ విత్తనం ఇంకెప్పుడు!

ఖరీఫ్ ముగిసింది.. రబీ వచ్చింది.. విత్తనం మాటే లేదు.. చినుకు రాలింది.. నేల తడిసింది.. సబ్సిడీ విత్తనం ఊసే లేదు.. కూటమి ప్రణాళిక లోపం అన్నదాతకు శాపమవుతోంది. పదునెక్కిన ఈ వానకు పొలమంతా నాగలి పట్టాల్సిన రైతు.. విత్తనం కోసమే ఎదురుచూడాల్సిన దుస్థితి తలెత్తింది. ఒకటా రెండా సీజన్ మొదలై పక్షం రోజులు దాటినా సబ్సిడీ విత్తన పంపిణీకి మోక్షం రావడం లేదు.



రాజుపాళెంలో శనగసాగుకు ట్రాక్టర్‌తో పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు, ఎర్రగుంట్ల మండలంలో శనగసాగుకు విత్తనాన్ని సిద్ధం చేసుకుంటున్న రైతన్న

కడప అగ్రికల్చర్: జిల్లాలో సబ్సిడీ శనగ విత్తన పంపిణీ అతిగతి లేకుండా పోయింది. రబీ సీజన్ ప్రారంభమై పక్షం రోజులు దాటినా ప్రభుత్వం ఇంతవరకు విత్తన పంపిణీ సంబంధించి ఎలాంటి చర్యలు తీసుకోలేదు. విత్తనాల పంపిణీకి ముందు కనీసం రైతుభరోసా కేంద్రాలలో రైతుల నుంచి రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించకపోవడంతో ఇక విత్తన పంపిణీ ఎప్పుడు చేస్తారని అన్నదాతలు మండిపడుతున్నారు. గతేడాది విత్తనాలను సరఫరా చేసిన టెండర్దార్లకు ఇంతవరకు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఈ ఏడాది విత్తన పంపిణీ ఆలస్యమవుతోన్నట్లు సమాచారం.

పదును ఆరిపోతుందనే...

ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. ఈ వర్షాలతో చాలా ప్రాంతాలలో పదును అయ్యింది. ఈ పదునులోనే చాలా మంది రైతులు శనగ పంటను సాగు చేయనున్నారు. కాకపోతే ప్రభుత్వం సబ్సిడీ విత్తనాలను సరఫరా చేయకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా దాదాపు రెండు లక్షల ఎకరాలలో శనగపంటను సాగుకానుంది.

మండలాల్లో ఇబ్బందులకు గురవుతున్న ఏవోలు.

జిల్లాలో శనగపంటను అధికంగా సాగు చేసే మండలాలైన పెద్దముడియం, రాజుపాలెం, తొండూరు, సింహాద్రిపురం, వేముల, వేంపల్లి, కొండాపురం, జమ్మలమడుగు, ఎర్రగుంట్ల, మైలవారంతోపాటు పలు మండాలల్లో పనిచేసే వ్యవసాయ అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారు. శనగను సాగు చేసే రైతులు రైతు భరోసా కేంద్రాల చుట్టూ ప్రదర్శనలు చేస్తున్నారు. దీనికి తోడు రైతులు అడిగే ప్రశ్నలకు వ్యవసాయ అధికారుల నుంచి మౌనమే సమాధానంగా ఉంటుందని రైతులు తెలిపారు.

రైతుల నుంచి విత్తనాలను కొనుగోలు...

ప్రభుత్వం సరఫరా చేస్తే సబ్సిడి విత్తనాల కోసం ఎదురు చూస్తే పదును ఆరిపోతుందని భావించిన పలువురు రైతులు ప్రైవేటు రైతుల నుంచి శనగలు కొనుగోలును చేస్తున్నారు. పైగా ప్రభుత్వం సరఫరా చేసే శనగ విత్తనాలు ఏవిధంగా ఉంటాయోననే ఆందోళన కూడా రైతులను వేధిస్తుంది.

పొట్టిపాడు నుంచి కొని తెచ్చాం



ప్రస్తుతం కురిసిన వర్షానికి శనగ విత్తుకుందామంటే ప్రభుత్వం రాయితీ శనగ విత్తనాలు ఇవ్వలేదు. దీంతో పదును ఆరిపోతుందని పొట్టిపాటు గ్రామంలో క్వింటాళు రూ. 6100తో రెండు క్వింటాళ్లు కొని తెచ్చుకున్నాను. – బోదం కుల్లాయిరెడ్డి, మాలెపాడు గ్రామం, ఎర్రగుంట్ల మండలం

ప్రభుత్వ బాధ్యతా రాహిత్యానికి పరాకాష్ట



రైతులకు సరఫరా చేసే శనగ విత్తనాల పంపిణీలో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోంది. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ముందస్తు ప్రణాళిక లేని కారణంగానే విత్తనాల సరఫరాను సకాలంలో సరఫరా చేయలేకపోయింది. దీంతో చాలా మంది రైతులు బయట మర్కెట్ నుంచి కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సి వచ్చింది. – గాలి చంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి

మరో మూడు నాలుగు రోజుల్లో...



శనగ విత్తనాల కోసం రైతులు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని మరో మూడు, నాలుగు రోజుల్లో ప్రారంభిస్తాం. ఒక పక్క రిజిస్ట్రేషన్‌తోపాటు విత్తనాల పంపిణీ కూడా ప్రారంభిస్తాం. రైతులెవరూ ఆందోళన చెందనవరం లేదు. –చంద్రానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి

పత్రికా స్వేచ్ఛపై కాలకూటమి
ప్రజల గొంతుగా నిలిచి ప్రశ్నిస్తే ప్రభుత్వానికి నచ్చదు..'సాక్షి'పై చంద్రబాబు సర్కార్ కక్షసాధింపుగా వ్యవహరిస్తోంది. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డితోపాటు పలువురు ప్రాతికేయులపై అక్రమంగా కేసులు పెట్టి వేధిస్తోంది. పత్రిక స్వేచ్ఛకు సంకెళ్లు వేయడంపై సీనియర్ జర్నలిస్టులు, వివిధ సంఘాల నేతలు ఖండిస్తున్నారు.



ఎడిటర్‌పై వేధింపులు తగదు



సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పోలీసుల వేధింపులు తగదు. పత్రికల్లో సమాజంలో జరుగుతున్న వివిధ అంశాలను ప్రచురిస్తుంటారు. దానిపై ప్రభుత్వానికి ఏవైనా అభ్యంతరాలుంటే వివరణ ఇవ్వాలి తప్ప కేసులు బనాయించి బెదిరించాలని చూడడం పత్రికా స్వేచ్ఛను హరించే యత్నమే. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుసరిస్తున్న ధోరణులు హిట్లర్, ముస్సోలిని లాంటి నియంతల పోకడలను తలపిస్తున్నాయి. పత్రికల గొంతుకను నొక్కాయాలని చూస్తున్న ప్రభుత్వ వైఖరిని ముక్తకంఠంతో ఖండించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.
– మోపూరి బాలకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఏపీయూడబ్ల్యుజే, వైఎస్సార్

కక్ష సాధింపులు సరికాదు



ప్రజాస్వామ్యానికి మూల స్తంభాల్లో ఒకటైన పత్రికలు ప్రతిపక్ష పాత్ర పోషించడం సర్వ సాధారణం. ప్రభుత్వ వైఫల్యాలు ఎత్తి చూపుతున్నారనే కక్షతో సాక్షిపై కత్తికట్టడం సరికాదు.ఎడిటర్‌ను బాధ్యుడిని చేస్తూ కేసులు బనాయించడం ఏమాత్రం సబబు కాదు. దాడులు, కేసులతో భయపెట్టి తమ దారికి అడ్డు తొలగించుకోవాలనుకోవడం అప్రస్వామికం. భావ ప్రకటన స్వేచ్ఛను హరించే విధానాలకు తక్షణమే స్వస్తి చెప్పాలి. – డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, వైద్యులు, యోగా నిపుణులు, కడప

ప్రశ్నించే గొంతుకలను నొక్కేసే యత్నం



విమర్శనాత్మకమైన, స్వతంత్రమైన, పరిశోధనాత్మకమైన పత్రికా స్వాతంత్ర్యం ఏ ప్రజాస్వామిక రాజ్యానికైనా జీవనాడి వంటిది అని నోబెల్ శాంతి బహుమతి గ్రహీత, దక్షిణాఫ్రికా విముక్తి ప్రదాత నెల్సన్ మండేల అభిప్రాయం. కానీ ఆంధ్రప్రదేశ్‌లో ప్రశ్నించే గొంతుకల పట్ల, ప్రత్యేకించి సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై పోలీసు కేసులు బనాయించి రాష్ట్ర ప్రభుత్వం కక్ష గట్టి వ్యవహరిస్తోంది. వీటిని పరిశీలిస్తే రాష్ట్రంలో మీడియా స్వేచ్ఛ ఉందా అనే అనుమానం సహజంగానే తలెత్తుతుంది. ఇది కేవలం సాక్షి సమస్య కాదు. ఈరోజు ఇది సాక్షికి సమస్య కావచ్చు. పాత్రికేయులు, ప్రజాస్వామిక వాదులు మేల్కొకోకపోతే ఇది రేపు అందరికీ సమస్యగా పరిణమిస్తుంది.
– ఎ.రఘునాథరెడ్డి, కో ఆర్డినేటర్, రాయలసీమ ఆకాంక్షల పౌర వేదిక, కడప

'సాక్షి'పై పోలీసుల తీరును నిరసిస్తూ.. నేడు ధర్నా
కడప కార్పొరేషన్: 'సాక్షి' మీడియాపై పోలీసుల దమనకాండను నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని ఆ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు వెంకటరెడ్డి, రాష్ట్ర నాయకులు పి. రామసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షులు మోపూరి బాలక్రిష్టారెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. సాక్షిలో పనిచేస్తున్న బ్యూరో ఇన్‌చార్జులు, స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్‌సీ ఇన్‌చార్జులపై పోలీసుల వేధింపులు కొనసాగుతున్నాయని, నెల్లూరు పోలీసులు సాక్షి బ్యూరో ఇన్‌చార్జితో పాటు ఎడిటర్ ధనుంజయరెడ్డికి కూడా నోటీసులిచ్చి బెదిరింపులకు దిగడం పత్రికా స్వేచ్ఛను హరించడమేనన్నారు. ఏదైనా వార్తలో, కథనంలో తప్పు ఉంటే ఖండన ఇవ్వాలే తప్పా ఆధారాలు చూపాలని పోలీసులు అడగటం అప్రజాస్వామ్యమన్నారు. కూటమి ప్రభుత్వం, పోలీసుల వైఖరిని నిరసిస్తూ కలిసివచ్చే ప్రజా సంఘాలు, జర్నలిస్టులతో కలిసి ధర్నాలు చేసి, కలెక్టర్, ఆర్‌డీఓ, తహసీల్దార్‌లకు వినతి పత్రాలు ఇవ్వాలని కోరారు.

క్లుప్తంగా

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు



విద్యార్థి వీపుపై కనిపిస్తున్న వాతలు

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి సుశాంత్‌ను పాఠశాల ఉపాధ్యాయుడు చితకబాదడంతో వాతలు పడ్డాయి. పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి సుశాంత్‌ను తెలుగు ఉపాధ్యాయుడు నారాయణ స్వామి కొట్టడంతో వీపుపై చిన్నపాటి గాయాలయ్యాయి. ఈ సంఘటనపై ఏఐఎస్‌బీ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఇందుకు కారణమైన ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎస్‌బీఐ జీవిత బీమాను సద్వినియోగం చేసుకోవాలి



పర్సనల్ ఆక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ చెక్కును అందజేస్తున్న ఎస్‌బీఐ అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్:స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా పర్సనల్ ఆక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ అమరేంద్ర కుమార్ సుమన్ పిలుపునిచ్చారు. కడపలోని ఐటీఐ సర్కిల్ బ్రాంచ్, వనిపెంట ఎస్‌బీఐ బ్రాంచ్‌లో జరిగిన కార్యక్రమంలో బాధితులకు పర్సనల్ ఆక్సిడెంట్ ఇన్స్రూ పాలసీ మొత్తాలను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పర్సనల్ ఆక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీని తీసుకోవడం అవసరమన్నారు. పాలసీ ద్వారా ఆర్థికంగా అన్ని విధాలా తోడ్పాటు అందుతుందన్నారు. అనంతరం కృష్ణకాంత్ శర్మ, సిద్దారెడ్డిల కుటుంబ సభ్యులకు ఆక్సిడెంట్ ఇన్సూరెన్స్ పాలసీ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ హేమ, రీజినల్ మేనేజర్ కృష్ణ కిషోర్, జనరల్ ఇన్సూరెన్స్ ఏరియా మేనేజర్ జయచంద్రతోపాటు ఇతర బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన పంటల క్లస్టర్ల అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానశాఖ కన్సల్టెంట్ విద్యాశంకర్

కడప అగ్రికల్చర్: ఉద్యాన పంటల క్లస్టర్ల సమగ్ర అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని ఉద్యానశాఖ కన్సల్టెంట్ విద్యాశంకర్ సూచించారు. గురువారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్ ఆధ్వర్యంలో ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో ఉద్యాన పంటల క్లస్టర్ సమగ్రాభివృద్ధి కార్యక్రమంపై అవగాహన, వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రధాన పంటలైన అరటి, బత్తాయి, ఉల్లి, పసుపు, చామంతి తదితర పంటల క్లస్టర్లు ఏర్పాటు చేసి ప్రాజెక్టు నిర్వహణ సంస్థ ద్వారా క్లస్టర్ సమగ్ర అభివృద్ధి కోసం చేపట్టవలసిన ప్రాసెసింగ్, మార్కెటింగ్, బ్రాండింగ్ , ఎగుమతి, మొదలకు కార్యక్రమాలకు ఆర్థిక సహాయం పొందవచ్చన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి సతీష్, సహాయ సంచాలకుడు రవిచంద్రబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి, ప్రధాన శాస్త్రవేత్తలు ప్రభాకర్‌రెడ్డి, సునీల్, ఉద్యానశాఖ అధికారులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, ఎగుమతిదారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు అన్యాయం

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ



మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : రాష్ట్రంలోని 17 మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కోటి సంతకాల సేకరణ కార్యక్రమం పులివెందులలో గురువారం ప్రారంభమైంది. స్థానిక భాకరాపురంలోని వైఎస్సార్ ఆడిటోరియంలో పులివెందుల మున్సిపాలిటీ, రూరల్, తొండూరు, లింగాల, సింహాద్రిపురం మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి, చవ్వా దుష్యంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్ర భాస్కర్‌రెడ్డిలు సమావేశం నిర్వహించారు. అంతకముందు ఆడిటోరియంలోని వైఎస్సార్ విగ్రహానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఇతర నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటి సంతకాల సేకరణలో భాగంగా ఎంపీ అవినాష్‌రెడ్డి సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష కోట్ల రూపాయలు విలువ చేసే మెడికల్ కళాశాలలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పప్పులు, బెల్లాలు మాదిరిగా ప్రైవేట్ యాజమాన్యాలకు ఇస్తున్నారన్నారు. పులివెందుల మెడికల్ కళాశాలకు సంబంధించిన 50 ఎకరాలకు చంద్రబాబు నిర్ణయించిన మేరకు ఏడాదికి అద్దె రూ.5వేలు అన్నారు. అక్కడ రూ.300 కోట్ల విలువ చేసే బిల్డింగ్‌లు ఉన్నాయని, దాదాపు రూ.100 కోట్ల విలువ చేసే స్థలం, మొత్తం నాలుగైదు వందల కోట్ల ఆస్తిని ఈ మాదిరి సంవత్సరానికి రూ.5వేలకు అద్దెకు ఇస్తారా అని ప్రశ్నించారు. ప్రైవేట్ యాజమాన్యానికి ఉచితంగా వైద్యం చేయాలన్న శ్రద్ధ ఎక్కడ నుంచి వస్తుందన్నారు. ప్రైవేట్ కళాశాలల్లో కూడా కొంత కోటా సీట్లు ఉచితంగా ఇవ్వాలని చట్టంలో ఉందని, కానీ ఆ చట్టాన్ని ఎవరూ అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రంలో 1923 నుంచి 2019 వరకు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవరకు దాదాపు 96 ఏళ్ల కాలంలో మన రాష్ట్రంలో 12 మెడికల్ కళాశాలల్లో 2200 మెడికల్ సీట్లు ఉండేవన్నారు. 2019లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక 17 మెడికల్ కళాశాలలను తీసుకొచ్చారన్నారు. ఈ కళాశాలల ద్వారా 2,500 మెడికల్ సీట్లు అదనంగా రాగా.. ప్రస్తుతం 4,700 మెడికల్ సీట్లు అయ్యాయన్నారు. జగనన్న ప్రభుత్వం విద్యపైన, వైద్యంపైన ఎంత శ్రద్ధ వహించిందో చెప్పడానికి ఇలాంటి ఉదాహరణలు అనేకం ఉన్నాయన్నారు. చంద్రబాబు నాయుడు చేపట్టిన మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణతో పేద విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

స్తంభించిన ఆరోగ్య శ్రీ సేవలు

రాష్ట్రంలో గత 5 రోజుల నుంచి ఆరోగ్యశ్రీ సేవలు స్తంభించాయని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఈ ప్రభుత్వం రూ.3,500 కోట్ల బకాయిలు పడిందన్నారు. దీంతో నెట్‌వర్క్ ఆసుపత్రులు ఆరోగ్య శ్రీ సేవలను నిలుపుదల చేశాయన్నారు. అలాగే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఫీజులు చెల్లించకపోతే కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు కూడా ఇవ్వడంలేదన్నారు. చంద్రబాబు తీరుకు నిరసనగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

చంద్రబాబుకు మ్యాటర్ వీక్.. ప్రచారం పీక్: ఎస్వీ సతీష్ కుమార్‌రెడ్డి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబుకు మ్యాటర్ వీక్ - ప్రచారం పీక్ అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఇటీవల కర్నూలులో మాట్లాడుతూ సూపర్ సిక్స్ - సూపర్ హిట్ అని చెప్పుకోవడం విచిత్రంగా ఉందన్నారు. అయన చెప్పినట్లు సూపర్ సిక్స్ పథకాలు అమలు కావాలంటే రూ.2లక్షల కోట్లు ఖర్చు అవుతుందన్నారు. అయితే గడిచిన 16 నెలల కాలంలో రూ.17వేల కోట్లు కూడా ఖర్చు పెట్టకుండా హామీలన్ని అమలు చేశానని చెప్పుకునే దరిద్రమైన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ఆడవారికి ఏడాదికి రూ.18వేలు అన్నారని, కేవలం ఈ పథకానికే రూ.40వేల కోట్లు ఖర్చు అవుతుందన్నారు. 50ఏళ్లు పైబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల పింఛను పథకాన్ని కూడా అటకెక్కించారన్నారు. ములకల చెరువులో బయటపడిన నకిలీ మద్యంలో టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి ఎన్నికలకు ముందు ఏడాదికి రూ.5వేల కోట్లు వచ్చే మార్గం చెబుతానని చంద్రబాబుతో ఒప్పందం చేసుకున్నాకే ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించారన్నారు. ఆ ఒప్పందం మేరకే ప్రస్తుతం నకిలీ మద్యాన్ని సరఫరా చేస్తున్నారన్నారు. వైఎస్ మనోహర్‌రెడ్డి, వజ్ర భాస్కర్‌రెడ్డిలు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి జిల్లాకు మెడికల్ కళాశాల ఉండాలనే సదుద్దేశంతో వైఎస్ జగన్ 17 మెడికల్ కళాశాలలను తీసుకు వచ్చారన్నారు. చంద్రబాబు గతంలో 14ఏళ్లు సీఎంగా ఉన్నారని, మళ్లీ ఇప్పుడు సీఎంగా ఉన్నారని, ఒక్క మెడికల్ కళాశాలను కూడా తీసుకురాలేదన్నారు.

విజేతలకు బహుమతులు పంపిణీ



బహుమతులు అందుకుంటున్న విజేతలు

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో గురువారం జిల్లా నెహ్రూ యువ కేంద్రం, వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు మహిళలు, పురుషులకు నిర్వహించారు. ఈ సందర్భంగా టూటౌన్ సీఐ సదాశివయ్య మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అనంతరం వాలీబాల్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.10వేలు ప్రొద్దుటూరు టౌన్ వారికి, ద్వితీయ బహుమతి రూ.7వేలు ఆర్‌సీపీ ఈకి, కబడ్డీలో మొదటి బహుమతి రాయలసీమ వ్యాయామ విద్య కళాశాల జట్టుకు రూ.10వేలు, కమలాపురం ఎస్ఎస్ఆర్ కాలేజీ విద్యార్థులకు ద్వితీయ బహుమతి రూ.7వేలు, ట్రోఫీతోపాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, హరిత రెడ్డి, వెంకట్ యాదవ్, ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఈసీ మెంబర్ డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, వేములపాటి సూర్యనారాయణరెడ్డి, గల్ఫ్ మహిళా సేవా సమితి కువైట్ వారు పాల్గొన్నారు.

సేవ చేయడమే పరమ ధర్మం

- వైవీయూ వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్



ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్ అవార్డు అందుకుంటున్న మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు

కడప ఎడ్యుకేషన్ : 'పరుల సేవ చేయడమే పరమ ధర్మము.. పరుల బాధను అర్థం చేసుకున్న వాడే పరమ భక్తుడు' అన్న వేమన మాటలు మనందరికీ స్ఫూర్తి మంత్రాలు. ఆయన ఆదర్శ భావజాలం యోగివేమన విశ్వవిద్యాలయంలో ఉన్న మనందరి మనసులలో ఇమిడిపోవాలని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ ఉద్ఘాటించారు.

యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ద్వారా సమాజానికి విస్తృత సేవలు అందించిన కళాశాలలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, వలంటీర్లకు యోగివేమన విశ్వవిద్యాలయ జాతీయ సేవా పథకం -2025 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని అన్నమాచార్య సెనేట్ హాలులో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సేవ జీవితంలో భాగం కావాలన్నారు. గ్రామీణ ప్రజలను ప్రభుత్వ పథకాలు, ఆరోగ్యం, విద్య, మూఢనమ్మకాలు వంటి అంశాలపై నిత్యం చైతన్యం చేయాలని సూచించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ పుత్తా పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఓలు, వలంటీర్లు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్నది వీరే..

ఉత్తమ వలంటీర్లు డి.శ్రావణి (ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజంపేట), డి. సిద్ధయ్య, (ఎస్.బి.ఎస్‌వైఎం డిగ్రీ కళాశాల, మైదుకూరు), కేబీ ఈశ్వర్(వైవీయూ కాలేజ్), కె. శ్రీనివాసులు రెడ్డి (వైవీయూ పీజీ కళాశాల).

ఉత్తమ ప్రోగ్రామ్ ఆఫీసర్లుగా..

డాక్టర్ కె. గోవింద రెడ్డి, (ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, కడప), డాక్టర్ యు.సునీత, (ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, పులివెందుల), సి. మల్లేశ్వరమ్మ, (వైఎస్ఆర్‌వి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వేంపల్లి,), డాక్టర్ ఎ.నాగరాజు, (ప్రభుత్వ పురుషుల కళాశాల (ఎ), కడప), డాక్టర్ పత్తి వెంకట కృష్ణా రెడ్డి, (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైదుకూరు), డాక్టర్ ఎస్.సునీత, (యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల, కడప), డాక్టర్ ఎస్.పి. వెంకటరమణ, (యోగి వేమన విశ్వవిద్యాలయ కళాశాల, కడప).

ఉత్తమ కళాశాలలుగా..

సి. సూర్యారావు, (ప్రిన్సిపల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల కడప), డాక్టర్ పి. నారాయణ రెడ్డి, (ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైదుకూరు,), ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, (ప్రిన్సిపల్ యోగి వేమన యూనివర్సిటీ కాలేజ్,).

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు:స్థానిక ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్‌సీ అర్హత కలిగి ఉర్దూ మీడియంలో జువాలజీ ఉర్దూ, సివిక్స్ ఉర్దూ సబ్జెక్టులలో 50 శాతం మార్కులు కలిగిన అభ్యర్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 22వ తేదీలోపు దరఖాస్తులను కళాశాల కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఈనెల 25న ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

సుబ్బరాయుడు సేవలు చిరస్మరణీయం



రిటైర్డ్ ఇంజినీర్ సుబ్బరాయుడు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రాయలసీమకు కృష్ణా నదీ జలాల మళ్లింపు కోసం నీటి పారుదల శాఖ రిటైర్డ్ ఇంజినీర్ సుబ్బరాయుడు చేసిన సేవలు చిరస్మరణీయమని కేసీ కెనాల్ ఆయకట్టుదారుల సంఘం మాజీ అధ్యక్షుడు దేవగుడి చంద్రమౌళీశ్వర రెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం నాయకుడు రూకా అశోక్‌రెడ్డి, ఏపీ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గాలి చంద్ర, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎంవీ సుబ్బారెడ్డి, పి.భాస్కర్, సీపీఎం అనుబంధ రైతు సంఘం నాయకుడు దస్తగిరి రెడ్డి తదితరులు కొనియాడారు. గురువారం నగరంలోని ఎద్దుల ఈశ్వర్ రెడ్డి హాల్‌లో ఇటీవల మరణించిన నీటిపారుదల శాఖ రిటైర్డ్ ఇంజినీర్ సుబ్బరాయుడు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుబ్బరాయుడు నీటిపారుదల శాఖలో పని చేస్తున్న సందర్భంలో నీటి లభ్యత, నీటి అవసరాలు అనే అంశంపై నిరంతరం అధ్యయనం చేయడమే కాకుండా ఉద్యమకారులకు అవసరమైన సూచనలు సలహాలు ఇచ్చేవారన్నారు. సుబ్బరాయుడు ఆలోచన నుంచి పుట్టుకొచ్చిన తుంగభద్ర నదిపై గుండ్రేవుల ప్రాజెక్టు, వేదవతి నదిపై ఎత్తిపోతల ప్రాజెక్టు, కేసీ కెనాల్ చివరి అయకట్టు స్థిరీకరణకు రాజోలి రిజర్వాయర్ నిర్మాణానికి నోచుకోకపోవడం విచారకరమన్నారు. సీపీఐ నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, సంఘాల నాయకులు సుబ్రహ్మణ్యం, మునయ్య, యానాదయ్య, కృష్ణమూర్తి, నాగిరెడ్డి, భద్రయ్య, గురవయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యలను ఆపి.. ప్రాణాలు నిలిపి..



మహిళను కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు



రామాంజనేయులును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

- ఎర్రగుంట్ల రైల్వే పోలీసుల చొరవతో నిలిచిన రెండు నిండు ప్రాణాలు
- శభాష్ పోలీస్ అంటూ ప్రశంసలు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల రైల్వే పోలీసుల చొరవతో ఇద్దరి నిండు ప్రాణాలు నిలిచాయి. కుటుంబ కలహాలతో మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవాలని రైలు పట్టాలపైకి రాగా రైల్వే పోలీసులు గమనించి వారిని కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గురువారం ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌లో జరిగిన ఈ సంఘటనలకు సంబంధించిన వివరాలిలా..

వేంపల్లికి చెందిన సుందరి సుమంజలి అనే మహిళ కుటుంబ కలహాల కారణంగా మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకోవాలని ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌కు వచ్చింది. రైలు పట్టాలపై పడుకొని ఉండటాన్ని ఎర్రగుంట్ల రైల్వే కానిస్టేబుళ్లు డి.వీరనారాయణ, శ్రీనివాసరావులు గమనించారు. వెంటనే రైల్వే ట్రాక్‌పై ఉన్న సుందరి సుమంజలిని కాపాడారు. తర్వాత రైల్వే పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చి వివరాలు సేకరించారు. ఆమె భర్తను పిలిపించి ఇద్దరికి కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలతో సంతోషంగా జీవించాలని నచ్చజెప్పి ఇంటికి పంపించారు.

మద్యం మత్తులో..

ప్రొద్దుటూరుకు చెందిన రామాంజనేయులు అనే వ్యక్తి ఇంటిలో గొడవ పడి అతిగా మద్యం తాగి ఎర్రగుంట్లకు వచ్చాడు. రైలు కింద పడి చనిపోవాలని రైలు పట్టాలపై పడుకున్నాడు. అదే సమయంలో డ్యూటీలో ఉన్న కానిస్టేబుళ్లు డి. వీరనారాయణ, రామాంజనేయరెడ్డిలు వెంటనే స్పందించి పట్టాలపై ఉన్న రామాంజనేయులును కాపాడి పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చారు. తర్వాత అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారిని పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించారు. ఈ రెండు సంఘటనల్లోనూ రైల్వే పోలీసులు చూపిన చొరవను చూసిన వారు శభాష్ పోలీస్ అంటూ ప్రశంసించారు.

కోత మిల్లులపై విజిలెన్స్ విచారణ



నగరవనం పనులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులోని సామిల్లు (కోత మిల్లు)లపై అటవీశాఖ విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా మిల్లులను నిర్వహిస్తున్నారని ఫిర్యాదులు రావడంతో విజిలెన్స్ డీఎఫ్ఓ ధర్మరక్షిత్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం విచారణ చేపట్టారు. సామిల్లులు రిజర్వ్ ఫారెస్ట్‌కు 5 కిలో మీటర్ల దూరంలో ఉండాలి. అయితే పట్టణంలోని మిల్లులు 5 కిలోమీటర్ల లోపలే ఉన్నాయనేది ప్రధాన ఫిర్యాదు. ప్రొద్దుటూరులో 17 సా మిల్లులు ఉండగా అందులో 6 మిల్లులకు లైసెన్స్ గడువు ముగిసినట్లు తెలుస్తోంది. విజిలెన్స్ అధికారులు ప్రొద్దుటూరులోని పలు కోత మిల్లులను పరిశీలించారు. మిల్లుల యజమానులను కార్యాలయాలకు పిలిపించి లైసెన్స్‌లు, ఇతర రికార్డులను తనిఖీ చేశారు. కొందరు మిల్లుల యజమానులు అటవీశాఖ అనుమతి లేకుండా లైసెన్స్‌లో ఉన్న చోటు కాకుండా మరో చోటికి మార్చినట్లు అధికారులు గుర్తించారు. మిల్లుల యజమానులు కొందరు లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోకుండానే నిర్వహిస్తున్నారు. గురువారం రాత్రి పొద్దుపోయే వరకు విచారణ జరిగింది. స్థానిక అధికారుల పాత్రపై కూడా విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. అనంతరం ఏకో పార్కులో జరుగుతున్న నగరవనం పనులను అధికారులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ హేమాంజలి, డీఆర్ఓ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పట్టించుకోరా?



సంబటూరు ప్రసాద్ రెడ్డి, రైతు నేత

చాపాడు : జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకునే నాథుడే లేరా అని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం చాపాడులో ఆయన మాట్లాడుతూ వరుణ దేవుడు కరుణించినప్పటికీ సబ్సిడీ బుడ్డ శనగ, వేరుశనగలతోపాటు డీఏపీ, యూరియా కోసం రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. పంటల బీమా గురించి పత్రికా ప్రకటనలు తప్ప.. ఇంత వరకు ఏ రైతుకు ఏ పంటకు ఎంత మొత్తం జమ చేశారో చెప్పాలన్నారు. ఉల్లి పంట మంచి దిగుబడి వచ్చినప్పటికీ 40 రోజుల నుంచి రైతులు కన్నీటిపాలవుతున్నారన్నారు. అరటి, వరి, టమాటా తదితర పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు.

వైద్యం వికటించి మహిళ మృతి

మైదుకూరు : ఓ వైపు ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని వైద్య శాఖాధికారులు పత్రికా ప్రకటనలు చేస్తున్నా ఆర్ఎంపీలు అటుంచి ఓ మెడికల్ షాపు నిర్వాహకుడు చేసిన వైద్యం వికటించి ఓ మహిళ నిండు ప్రాణం పోయిన సంఘటన మైదుకూరులో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక కడప రోడ్డుకు చెందిన ఓ మహిళకు గురువారం మధ్యాహ్నం ఛాతీలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆమెను అదే రోడ్డులో ఉన్న ఓ మెడికల్ షాపు వద్దకు తీసుకు వచ్చారు. వైద్యం కూడా చేస్తున్న ఆ మెడికల్ షాపు నిర్వాహకుడు సదరు మహిళకు సెలైన్ ఎక్కించి అందులోనే ఇంజక్షన్లను కలిపినట్టు సమాచారం. అది వికటించి మహిళ ప్రాణాలు పోయాయి. సంఘటన బయటకు పొక్కకుండా కొందరు మధ్యవర్తులు పంచాయితీ చేసినట్టు సమాచారం. ఆర్ఎంపీలపై, మెడికల్ షాపులపై అధికారుల తనిఖీలు కొరవడడంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తహసీల్దార్ కార్యాలయంలో కలెక్షన్ కింగ్!

- ఏ పని కావాలన్నా ఆయనే కీలకం
- చేతులు తడిపితే ఓకే.. లేదంటే కాళ్లరిగేలా తిరగాల్సిందే
- ఖాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో తిష్టవేసిన అవినీతి



ఖాజీపేట తహసీల్దార్ కార్యాలయం

ఖాజీపేట : ఖాజీపేట తహసీల్దార్ కార్యాలయంలోకి నీతి రానంటోంది.. అవినీతి పోనంటోంది. ఎంత మంది అధికారులు, కింది స్థాయి సిబ్బంది సస్పెండ్ అయినా, ఏసీబీకి దొరికినా పనితీరులో మార్పు లేదు. వచ్చిన వారంతా పైసల కోసం కక్కుర్తి పడటం, అందరినీ వేధించడం పరిపాటిగా మారింది. ప్రజల సమస్యలను వారికి లాభంగా మార్చుకుని అందరి దగ్గర నుంచి ముక్కు పిండి మరీ పైసలు వసూలు చేస్తున్నారు. ఎంత ఎక్కువగా తిప్పుకుంటే అంత డబ్బులు అన్నట్లుగా వ్యవహారం ఉండటంతో ప్రజలు ఎక్కువ సార్లు తిరగలేక వారు అడిగిన కాడికి డబ్బులు ఇచ్చి పనులు చేయించుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే..

ఖాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో ఒక అధికారి కింగ్ మేకర్‌గా మారాడు. ఏ పని చేయాలన్నా ఆయనదే కీలక పాత్రగా మారింది. ఆయన అనుమతి లేనిదే అలాగే ఆయన సహకారం లేనిదే తహసీల్దార్ కార్యాలయంలో ఏ పనీ పూర్తి కాదు. ప్రతి పనికి ఆయన ఒక ధర నిర్ణయిస్తాడు. ఆ మొత్తం చేతికి వచ్చిందంటే చాలు సెలవు దినాల్లో కూడా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి సెలవులో ఉన్న సిబ్బందిని పిలిపించుకుని మరీ పనులు పూర్తి చేస్తాడు. లేదంటే ప్రజల సమస్యలను అస్సలు పట్టించుకోడు. వారికి చుక్కలు చూపిస్తాడు. ఇలా నెల, రెండు నెలలైనా తిరుగుతూ ఉండాల్సిందే. అదే కాసులు అందితే చకచకా పనులు పూర్తి చేస్తాడు.


దిగువ స్థాయి సిబ్బంది పనితీరూ అంతే..

భూ సమస్యలు, అన్నదమ్ముల భాగ పరిష్కారం పూర్తి చేసుకున్న భూముల నమోదు, ఆన్‌లైన్ నమోదు, పాసు పుస్తకాలు, ఇలా ఒక్కటేమిటి ఏ పని కావాలన్నా దిగువ స్థాయి సిబ్బంది పనితీరు చాలా దారుణంగా ఉంది. కొందరు కట్టుబడి స్థాయి సిబ్బంది కూడా డబ్బులు వసూలు చేస్తున్నారు. మామూళ్లు ఇవ్వనిదే దిగువ స్థాయిలోని వారు సైతం సంతకాలు చేయడం లేదు. అందుకు వారు మధ్యవర్తులను ఏర్పాటు చేసుకుని వారి ద్వారా డబ్బులు తీసుకుంటున్నారు. డబ్బు ముట్టిందంటే సంతకాలు చేస్తున్నారు. ఇలాంటి అక్రమాలపై ఉన్నతాధికారులు నిఘా ఉంచి ప్రత్యేక చర్యలు తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

టీడీపీ నాయకులకే బేజారు..

తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న తంతును చూసి టీడీపీ నాయకులే బేజారు పడుతున్నారు. అధికార పార్టీలో ఉండి కూడా తమ పనులు జరగడం లేదని వాపోతున్నారు. అధికారుల దగ్గరకు పనులు చేయించుకునేందుకు వెళ్లలేక.. వారి డిమాండ్లు తీర్చలేక సతమతమవుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకుని నిజాయితీగా పనిచేసే వారిని నియమిస్తే బాగుంటుందని కోరుతున్నారు. తమ వద్దకు వచ్చే వారి పనులు కూడా చేయలేక చివరకు తమ పనులు కూడా చేసుకోలేక ఏకంగా తహసీల్దార్ కార్యాలయం వైపు వెళ్లడమే మానుకున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది.

డబ్బు ఇవ్వలేదని తిప్పుతున్నారు..



1250–4 సర్వే నంబర్‌లో నాకు 1.06 సెంట్ల స్థలం ఉంది. 1987లో నాకు ప్రభుత్వం భూమిని కేటాయించింది. అప్పటి నుంచి నేను సాగు చేసుకుంటున్నాను. 2017లో నా భూమిని వివాదాస్పద భూమిగా ఆన్‌లైన్‌లో అధికారులు నమోదు చేశారు. ఈ భూమిపై కోర్టుకు వెళితే నాకు అనుకూలంగా వచ్చింది. దీనికి సంబంధించి అన్ని పత్రాలను జాయింట్ కలెక్టర్‌కు చూపించాను. వెంటనే నా భూమి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. నెల రోజుల నుంచి ఖాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ దగ్గరకు తిరుగుతున్నా ఎలాంటి రిపోర్టు రాయడం లేదు. పని కావాలంటే డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇవ్వలేదని తిప్పుతున్నారు. నెల రోజులుగా తిరుగుతున్నా అధికారులు పలకడం లేదు. ఆన్‌లైన్ చేయడం లేదు.

తవ్వా సుబ్బారెడ్డి, ఖాజీపేట

ట్రాన్స్‌ఫార్మర్ సర్టిఫికెట్ కోసం తిరుగుతున్నా..



2.85 ఎకరాల్లో మాకు పొలం ఉంది. పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ పెట్టుకోవాలని అనుకుంటున్నాను. రెవెన్యూ అధికారుల క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం ఆర్ఐ చుట్టూ తిరుగుతున్నాను. నెల రోజులుగా తిరుగుతున్నా ఆయన పలకడం లేదు. డబ్బులు అడుగుతున్నారు. ఇవ్వలేదన్న కారణంగానే రోజు తిప్పుతున్నారు. ఎన్ని సార్లు తిరిగినా ఏదో పనిలో ఉన్నాను.. చేస్తాను అంటూ తిప్పుతున్నారు.

పి.వెంకటసుబ్బారెడ్డి, సుంకేశుల గ్రామం

రిపోర్టులు ఆలస్యం అవుతున్నాయి..

చాలా వరకు నా వద్దకు రిపోర్టులు రావడంలో కొంత ఆలస్యం జరుగుతోంది. అయితే డబ్బులు డిమాండ్ చేసి వసూళ్లు చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. రిపోర్టులు త్వరగా ఇవ్వాలని నేను అందరికీ చెబుతున్నాను. రిపోర్టులు చేయడంలో అవగాహన లేకపోవడం వల్లనే ఆలస్యం అవుతోందని నేను అనుకున్నాను. క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాను.

రమణమ్మ,తహసీల్దార్

యువర్స్

● వికాసం



నిరుద్యోగిగా ఉన్నా సరే...

కొద్దిమందిలో ఉండే అపోహ...

'కష్టపడుతున్నప్పుడే ఒత్తిడికి గురవుతాం'

అసలు విషయం ఏమిటంటే, కష్టపడుతున్నప్పుడే కాదు పనిచేయకుండా, ఏమీ పట్టకుండా ఉన్నప్పుడు కూడా ఒత్తిడికి గురవుతాము. మనం ఏదైనా విషయానికి సంబంధించి తరచుగా ఒత్తిడికి గురవుతుంటే 'అదంతేలే' అని అనుకోవడానికి లేదు. 'ఎందుకు ఇలా జరుగుతుంది?' అని విశ్లేషించుకుంటే ఒక పరిష్కార మార్గం తప్పనిసరిగా కనిపిస్తుంది.

ఒత్తిడిగా అనిపించినప్పుడు ఎవరికైనా చిన్న ఫోన్ కాల్ చేయండి, లేదా ఇమెయిల్ పంపించండి. చిన్న పని అయినా సరే, అది మీ ఒత్తిడిని తగ్గించడంలో కీలకం అవుతుంది.

నిరుద్యోగిగా ఉన్నా సరే క్రమశిక్షణకు దూరం కాకూడదు. ఎప్పుడూ ఏదో ఒకటి నేర్చుకుంటూనే ఉండాలి. ఒకటి కాకుంటే మరొకటి ఇంటర్వ్యూలకు హాజరవుతూనే ఉండాలి.

– **జెఫ్ బెజోస్**, ఫౌండర్, అమెజాన్

● ఆర్ట్ అండ్ కల్చర్



బొమ్మల కళ

బొమ్మలు మాట్లాడవు.
తమ గురించి మాట్లాడేలా చేస్తాయి.
అలా మాట్లాడాలంటే ఆర్టిస్ట్‌లో అద్భుత సృజన ఉండాలి.
అలాంటి ఒక ఆర్టిస్ట్ ఆమదాలవలసకు చెందిన ప్రియాంక.
శుభకార్యాలకు తగ్గట్టు రకరకాల థీమ్స్‌తో బొమ్మల సిరీస్ రూపొందిస్తూ పాతకళకు కొత్త కళ తీసుకువస్తోంది ప్రియాంక...

'చిన్నప్పుడు ఆడుకున్న ఆటల్లో బొమ్మలే నా బతుకు బండిని నడిపిస్తాయని నేను అసలు ఊహించనే లేదు' అంటుంది ప్రియాంక. బొమ్మల ద్వారా నేటి తరానికి సంప్రదాయ విలువలను వివరించడంలో ఆనందం ఉందంటారు ఆమె. తన మనసులో మెదిలిన ఊహకు సృజనాత్మకంగా ప్రాణం పోస్తూ, బొమ్మలను థీమ్‌కు తగ్గట్టు రూపొందిస్తూ వినియోగదారుల మనసు గెలుచుకుంటుంది ప్రియాంక. ఆ బొమ్మలు సనాతన సంప్రదాయాలకు ప్రతీకలుగా కనిపిస్తాయి. కనుమరుగవుతున్న కళలు కళ్ల ముందు కనబడతాయి.

అనుబంధాల రైలుబండి

కాంక్రీట్ జంగిల్‌లో న్యూక్లియర్ ఫ్యామిలీల నడుమ దూరమవుతున్న అనుబంధాలు ప్రియాంక తయారుచేసే బొమ్మలతో గుర్తుకు వస్తాయి. ఆమదాలవలసకు చెందిన ఒక పెద్దాయన 60వ పుట్టిన రోజు వేడుకను భిన్నంగా చేయాలని కుటుంబ సభ్యులు ఆలోచించారు. ప్రియాంకకు విషయాన్ని వివరించారు. అరవై ఏళ్లలో జరిగిన ఘట్టాలను అద్భుతమైన రీతిలో బొమ్మల రూపంలో కళ్లకు కట్టేలా తీర్చిదిద్దింది ప్రియాంక. అన్నప్రాసన వేడుక నుంచి పదవీ విరమణ వేడుక వరకు... ఆ పెద్దాయన జీవితంలోని వివిధ దశలను చిన్న రైలు బండి మాదిరిగా బొమ్మల్లో తయారు చేసి శభాష్ అనిపించుకుంది.

తాళికట్టు శుభవేళ

పలాసకు చెందిన ఒక వ్యాపారి నూతన గృహ ప్రవేశ వేడుకను భిన్నంగా చేయాలనుకున్నాడు. కాన్సెప్ట్‌ను వివరించాడు. బిల్డింగ్ నమూనా నుంచి సత్యనారాయణ వ్రతం, గో మాత ప్రవేశంతో సహా అన్నింటిని చక్కని బొమ్మలతో కళ్లకు కట్టింది ప్రియాంక. శుభకార్యానికి వచ్చిన అతిథులంతా ఈ థీమ్‌ను చూసి భలే ముచ్చటపడ్డారు.

శ్రీకాకుళం నగరంలోని ఒక కార్పొరేట్ బ్యాంక్‌లో నవరాత్రి పూజలు నిర్వహించాలని బ్యాంక్ సిబ్బంది భావించారు. రెండు రోజులు కష్టపడి నవరాత్రి వేడుకల థీమ్‌ను తయారు చేసి బ్యాంక్‌ను లక్ష్మీనిలయంగా మార్చింది ప్రియాంక. వివాహ వేడుకకు ప్రారంభ ఘట్టమైన గోధుమరాయి కార్యక్రమం నుంచి తాళికట్టు శుభవేళ వరకు తయారు చేసిన వెడ్డింగ్ సెట్ ప్రియాంక స్పెషల్. ఆ సెట్ చూస్తే మన కళ్ల ముందే పెళ్లి జరిగినంత సంబరం మన సొంతం అవుతుంది.

– **దువ్వూరి గోపాలరావు,**
సాక్షి, శ్రీకాకుళం
ఫొటోలు:
జయశంకర్ కుప్పిలి

ఇదే నా ప్రపంచం

చిన్నప్పుడే కాదు పెద్దయ్యాక కూడా బొమ్మలను వదల్లేదు. అమ్మ సాయంతో వాటిని చక్కగా అలంకరించడం చిన్నప్పటి నుంచి నా అలవాటు. డిగ్రీ పూర్తయింది. ఉపాధి కోసం ఏదో ఒకటి చేయాలి అనుకున్నాను. బొమ్మలతోనే కొత్తగా ఏదైనా చేయాలనుకున్నాను. బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. నా ఆలోచనలను నాన్నతో పంచుకున్నాను. ఆయన ప్రోత్సహించారు. వర్క్‌షాపులో కొంత భాగం నన్ను వినియోగించుకోమన్నారు. ఆర్టిస్టిక్‌గా షోరూమ్‌ను సిద్ధం చేశారు. విభిన్న రకాల థీమ్‌లను సిద్ధం చేశాను. సోషల్ మీడియా వేదికగా నేను తయారుచేసిన బొమ్మలను, ఫొటోలను షేర్ చేయడం మొదలుపెట్టాను. ఆర్డర్లు పెరిగాయి. బొమ్మల ద్వారా సంప్రదాయాల్ని వివరిస్తున్నందుకు ఆనందంగా ఉంది.

- ప్రియాంక

● టెక్... టాక్

జీవం ఉట్టిపడే ఇమేజ్ జనరేషన్‌తో జెమిని 'నానో బనానా మోడల్' పాపులర్ అయింది. నానో బనానా ఏఐ మోడల్‌ను ప్రారంభించినప్పటి నుంచి 500 మిలియన్‌లకు పైగా ఇమేజ్‌లకు ఉపయోగించబడింది. తాజాగా... జెమిని యాప్స్ నుంచి సెర్చ్ అండ్ లెన్స్‌కు నానో బనానా మోడల్‌ను విస్తరించారు. ఇమేజ్‌లు జనరేట్ చేయడానికి, ఎడిట్ చేయడానికి నానో బనానాను ఏఐ మోడ్, గూగుల్ లెన్స్‌తో అనుసంధానించారు. దీనివల్ల యూజర్‌లు గూగుల్ ఎకోసిస్టమ్ దాటకుండానే అడ్వాన్స్‌డ్ ఏఐ ఇమేజ్ ఎడిటింగ్ అండ్ క్రియేషన్ టూల్స్‌తో యాక్సెస్ కావచ్చు. గూగుల్ సెర్చ్ ఏఐ మోడల్‌లో ప్రాంప్ట్ బాక్స్ దిగువన ఎడమవైపు కొత్త ప్లస్ ఐకాన్ కనిపిస్తుంది. ఈ ఐకాన్‌ను నొక్కితే కొత్త గ్యాలరీ, కెమెరా, క్రియేట్ ఇమేజ్‌లాంటి కొత్త క్రియేటివ్ ఆప్షన్స్ కనిపిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న యూజర్‌లకు ఈ ఇంటిగ్రేషన్ అందుబాటులో ఉందా లేదా అనే విషయంలో స్పష్టత లేదు.



● ఏఐ ఏరియా

మాయి-ఇమేజ్-1



ఈ సంవత్సరం ప్రారంభం నుంచి మైక్రోసాఫ్ట్ ఏఐ(మాయి) ఇన్-హౌజ్ జనరేటివ్ మోడల్స్‌ను అభివృద్ధి చేయడంపై దృష్టి పెట్టింది. గత ఆగస్టులో స్పీచ్ జనరేషన్ మోడల్ మాయి-వాయిస్-1 లాంచ్ చేసింది.

తాజాగా తమ మొట్టమొదటి మాయి-ఇమేజ్-1ను ఆవిష్కరించింది.

ఇది 10 టెక్స్ట్-టు-ఇమేజ్ జాబితాలో చోటు సాధించడం విశేషం.

జనరల్ పర్పస్ ఏఐ మోడల్స్‌లా కాకుండా 'మాయి-ఇమేజ్-1'ను 'పర్పస్-బిల్ట్' మోడల్‌గా తీర్చిదిద్దారు. ప్రాక్టికల్, రియల్ వరల్డ్ క్రియేటివ్ టాస్క్‌లకు ఈ మోడల్ బాగా ఉపయోగపడుతుందని కంపెనీ తెలియజేసింది. ఈ మోడల్‌కు సంబంధించి సాంకేతిక విషయాలను వివరంగా వెల్లడించనప్పటికీ లైటింగ్, ప్రకృతి దృశ్యాలు, ఇతర సృజనాత్మక దృశ్యాలతో సహా ఫోటోరియలిస్టిక్ చిత్రాలను రూపొందించడంలో ఈ మోడల్ బలాన్ని కంపెనీ హైలైట్ చేసింది.

ఇతర మోడల్స్‌తో పోల్చితే 'మాయి-ఇమేజ్-1' చాలా త్వరగా రిజల్ట్‌ను చూపిస్తుందని, వేగం, నాణ్యత మధ్య బ్యాలెన్స్ చూపిస్తుందని తెలియజేసింది మైక్రోసాఫ్ట్.



విన్ బై ఏ నోస్

చాలా తక్కువ తేడాతో విజయం సాధించడానికి సంబంధించి వాడే మాట... విన్ బై ఏ నోస్
ఉదా: శ్రావణి వోన్ ది రేస్, బట్ షీ వోన్లీ వోన్ బై ఏ నోస్

వెల్ అప్ ఇన్ ఇయర్స్

'వయసు పైబడిన' 'పాత' అనేదానికి సంబంధించి వాడే మాట... వెల్ అప్ ఇన్ ఇయర్స్
ఉదా: జాన్స్ వెల్ అప్ ఇన్ ఇయర్స్ బట్ హెల్తీ

ఇట్ ఈజ్ ఏ లాంగ్ లేన్ దట్ హ్యాజ్ నో టర్నింగ్

'కష్టాలు శాశ్వతం కాదు' అనే చెప్పే సందర్భంలో ఉపయోగించే మాట... ఇట్ ఈజ్ ఏ లాంగ్ లేన్ దట్ హ్యాజ్ నో టర్నింగ్. **ఉదా:** బట్ ఇట్ ఈజ్ ఏ లాంగ్ లేన్ దట్ హ్యాజ్ నో టర్నింగ్. ఐయామ్ ష్యూర్ థింగ్స్ విల్ చేంజ్ సూన్

శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్ 11



డిస్‌ప్లే:	14.60 అంగుళాలు
రిఫ్రెష్ రేట్:	120 హెచ్‌జడ్
రిజల్యూషన్:	1848×2960 పిక్సెల్స్
మెమోరీ:	128జీబి 12జీబి ర్యామ్/ 256జీబి 12జీబి ర్యామ్/ 512 జీబి 12జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా:	12 ఎంపీ
బ్యాటరీ:	11600 ఎంఏహెచ్

హెచ్ఎండీ టచ్ 4జీ



సైజ్:	3.2 అంగుళాలు
రిజల్యూషన్:	240×320 పిక్సెల్స్
బరువు:	100 గ్రా.
కలర్స్:	డార్క్ బ్లూ, సియాన్
ఇంటర్నల్:	64 ఎంబీ 128 ఎంబీ ర్యామ్



వన్‌ప్లస్ పాడ్ లైట్

డిస్‌ప్లే:	11.00 అంగుళాలు
ఫ్రంట్ కెమెరా:	5 ఎంపీ,
రిజల్యూషన్:	1920× 1200 పిక్సెల్స్
ర్యామ్:	6జీబి
ఇంటర్నల్ స్టోరేజ్:	128జీబి
బ్యాటరీ:	9340 ఎంఏహెచ్
బరువు:	530 గ్రా.

సాక్షి సినిమా

ముచ్చటగా మూడోసారి!



● నెల్సన్, రజనీకాంత్

హీరో రజనీకాంత్, డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్‌లది హిట్ కాంబినేషన్. వీరి కాంబోలో వచ్చిన తొలి చిత్రం 'జైలర్' 2023 ఆగస్టు 10న విడుదలై, బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తాజాగా వీరిద్దరి కలయికలో 'జైలర్ 2' సినిమా రూపొందుతోన్న సంగతి తెలిసిందే. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. 'జైలర్' సూపర్ హిట్ కావడంతో 'జైలర్ 2' సినిమాపై ఇటు ఇండస్ట్రీలో అటు ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 2026 జూన్‌లో 'జైలర్ 2' విడుదల కానుంది. ఇదిలా ఉంటే... రజనీకాంత్-నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్ ముచ్చటగా మూడోసారి రిపీట్ కానుందని కోలీవుడ్ టాక్. ఇప్పటికే 'జైలర్ 2' చిత్రీకరణ సుమారు 70 శాతం పూర్తయిందట. ఈ సినిమా తర్వాత మరోసారి రజనీకాంత్‌తో ఓ మూవీ కోసం నెల్సన్ దిలీప్ స్క్రిప్ట్ సిద్ధం చేస్తున్నారని టాక్. ఈ స్టోరీ లైన్‌ని ఇటీవల రజనీకాంత్‌కి వినిపించగా ఆయన కూడా పచ్చజెండా ఊపారట. మరి... రజనీ-నెల్సన్ కాంబినేషన్‌లో మూడో చిత్రం ఉంటుందా? అనే విషయం తెలియాలంటే అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాలి.

తిలక్ వర్మ ప్రతిభ అసాధారణం

- చిరంజీవి



● సుస్మిత, తిలక్ వర్మ, చిరంజీవి, అనిల్ రావిపూడి

ఇటీవల జరిగిన ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో పాకిస్థాన్‌పై భారత్ ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన యువ క్రికెటర్ తిలక్ వర్మను హీరో చిరంజీవి సన్మానించారు. చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మన శంకరవరప్రసాద్ గారు'. ఈ సినిమాలో నయనతార హీరోయిన్‌గా, కేథరిన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో అర్చన సమర్పణలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సెట్స్‌కి ఇటీవల తిలక్ వర్మని ఆహ్వానించి, యూనిట్ సమక్షంలో సన్మానించారు చిరంజీవి. ''ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్- పాకిస్థాన్ తలపడ్డాయి. ఎంతో ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఆడుతూ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో భారత్ విజయంలో కీలక భాగస్వామి అయిన తిలక్ వర్మ ప్రతిభ అసాధారణం. కృషి, క్రమశిక్షణ అన్నది కేవలం క్రీడల్లోనే కాకుండా జీవితంలోనూ విజయానికి మార్గదర్శకం'' అని చిరంజీవి చెప్పారు.

కాంబినేషన్ సెట్?



● విజయ్ దేవరకొండ

హీరో విజయ్ దేవరకొండ-డైరెక్టర్ విక్రమ్ కె. కుమార్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుందా? అంటే అవుననే వార్తలు వినిపిస్తున్నాయి. విజయ్ దేవరకొండ ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. తనకు 'టాక్సీవాలా' (2018) వంటి హిట్ మూవీ అందించిన దర్శకుడు రాహుల్ సంకృత్యాన్‌తో రెండో సినిమా చేస్తున్నారు విజయ్. మరోవైపు 'రాజావారు రాణిగారు' చిత్రదర్శకుడు రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాత డైరెక్టర్ విక్రమ్ కె. కుమార్‌తో విజయ్ దేవరకొండ ఓ సినిమా చేయనున్నారని టాక్. 'ఇష్క్, మనం, హలో, నానీస్ గ్యాంగ్‌లీడర్' వంటి పలు చిత్రాలను తెరకెక్కించి, తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ఓ గుర్తింపు సొంతం చేసుకున్నారు విక్రమ్ కె. కుమార్. ఇక ఆ మధ్యలో నితిన్ హీరోగా ఓ సినిమా తెరకెక్కిస్తారనే వార్తలు వచ్చినప్పటికీ ఎలాంటి ప్రకటన లేదు. అయితే తన తాజా చిత్రాన్ని విజయ్‌తో చేయనున్నారట విక్రమ్. ఇందుకోసం కథ సిద్ధం చేసే పనిలో ఉన్నారట. మరి... ఈ కాంబినేషన్ సెట్ అవుతుందా? వేచి చూడాల్సిందే.



● విక్రమ్ కె. కుమార్

కచ్చితంగా నచ్చుతుంది డ్యూడ్

- ప్రదీప్ రంగనాథన్



● రవిశంకర్, బుచ్చిబాబు, హను, సాయి, ప్రదీప్, మమిత, కీర్తీశ్వరన్, నవీన్

''తెలుగు ప్రేక్షకులు నా సినిమాలన్నింటినీ గొప్పగా ఆదరించారు. మీ అభిమానానికి కృతజ్ఞతలు. మీ కుటుంబంలో ఒకరిగా చూసినందుకు చాలా థ్యాంక్స్. నేను నటించిన 'లవ్ టుడే, డ్రాగన్' సినిమాలు మీకు నచ్చినట్లయితే.. మంచి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన 'డ్యూడ్' చిత్రం కూడా కచ్చితంగా అందరికీ నచ్చుతుంది. నాకు మంచి ఛాన్స్ ఇచ్చిన మైత్రి మూవీ మేకర్స్‌కి ధన్యవాదాలు'' అని ప్రదీప్ రంగనాథన్ చెప్పారు. కీర్తీశ్వరన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, మమిత బైజు జంటగా నటించిన చిత్రం 'డ్యూడ్'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం నేడు తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి దర్శకులు హను రాఘవపూడి, బుచ్చిబాబు, సాయి రాజేశ్, రాహుల్ సాంకృత్యాన్, మహేశ్, శివ నిర్వాణ అతిథులుగా హాజరై, 'డ్యూడ్' ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. కీర్తీశ్వరన్ మాట్లాడుతూ– ''నేను 'డ్యూడ్' స్క్రిప్ట్ రాసుకుని దర్శకుడు కావాలనుకున్న తర్వాత చెన్నై మొత్తం తిరిగాను. ఫైనల్‌గా మైత్రీ మూవీ మేకర్స్‌లో నా సినిమా ప్రయాణం ప్రారంభం అయింది. ఈ బ్యానర్‌లో పని చేస్తానని నా కలలో కూడా అనుకోలేదు'' అని చెప్పారు. ''అందమైన ప్రేమకథగా రూపొందిన ఈ చిత్రంలో బలమైన భావోద్వేగాలు ఉన్నాయి'' అని రవిశంకర్ అన్నారు. ''ఈ సినిమా తప్పకుండా అందర్నీ అలరిస్తుంది'' అని నవీన్ యెర్నేని పేర్కొన్నారు. ఈ వేడుకలో కెమెరామేన్ నికిత్ బొమ్మి, సంగీత దర్శకుడు సాయి అభ్యంకర్, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి తదితరులు మాట్లాడారు.

ఎల్లమ్మలో...



● దేవిశ్రీ ప్రసాద్

ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటించనున్నారని తెలిసింది. 'బలగం' ఫేమ్ దర్శకుడు వేణు యెల్దండి తర్వాతి చిత్రం 'ఎల్లమ్మ'. ఈ సినిమాను 'దిల్' రాజు నిర్మించనున్నారు. విలేజ్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో హీరోగా నాని, నితిన్ వంటి వార్ల పేర్లు తెరపైకి వచ్చాయి. తాజాగా ఈ సినిమాలో దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటించనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన సంప్రదింపులు జరుగుతున్నాయని, ఈ చిత్రంలో నటించేందుకు దేవిశ్రీ కూడా ఆసక్తి చూపిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది.

పడి పడి నవ్వుకుంటారు

- కిరణ్ అబ్బవరం



● జైన్స్ నాని, శివ, రాజేష్ దండ, యుక్తి తరేజా, కిరణ్ అబ్బవరం

''కె-ర్యాంప్' చిత్రం మేము అనుకున్నదానికంటే ఇంకా బాగా వచ్చింది. ఈ సినిమాని అనుకున్నప్పుడే దీపావళికి రిలీజ్ అని ఫిక్స్ అయ్యాం. థియేటర్స్‌లోకి వెళ్లేముందు ఇది పూర్తి వినోదాత్మక చిత్రం అని గుర్తుపెట్టుకోండి. కచ్చితంగా పడి పడి నవ్వుతారు. మీ టికెట్ డబ్బులు వృథా కావు.. ఇందుకు నాది గ్యారెంటీ'' అని కిరణ్ అబ్బవరం తెలిపారు. ఆయన హీరోగా, యుక్తి తరేజా హీరోయిన్‌గా నటించిన చిత్రం 'కె- ర్యాంప్'. జైన్స్ నాని రచన, దర్శకత్వంలో హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్‌పై రాజేష్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి దర్శకులు విజయ్ కనకమేడల, వీఐ ఆనంద్, రామ్ అబ్బరాజు, సుబ్బు, చంద్రమోహన్ అతిథులుగా హాజరై,''దీపావళి పండగ కళ 'కె-ర్యాంప్'లో కనిపిస్తోంది. ఈ సినిమా మంచి విజయం సాధిస్తుంది'' అని తెలిపారు. రాజేశ్ దండ మాట్లాడుతూ- ''మేము ఎంత ఏడ్చినా, తొడలు కొట్టినా, ఎన్ని చెప్పినా సినిమాలో కంటెంట్ ఉంటేనే ప్రేక్షకులు ఆదరిస్తారు. ఈ దీపావళికి రిలీజ్ అవుతున్న సినిమాలన్నీ బ్లాక్‌బస్టర్ కావాలి'' అని తెలిపారు. ''మా సినిమా అదిరిపోయింది. ఈ దీపావళికి పెద్ద హిట్ అవుతుంది'' అన్నారు జైన్స్ నాని. ''తెలుగులో నేను చేసిన మూడో చిత్రమిది. 'కె-ర్యాంప్' చూశాక ప్రేక్షకులు నన్ను మరింతగా ఇష్టపడతారు'' అని యుక్తి తరేజా పేర్కొన్నారు.

ఓటీటీ

ఇది చూడొచ్చు

సమయం విలువ తెలిపే సినిమా

ఓటీటీలో 'ఇది చూడొచ్చు' అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం 'ది డెస్పరేట్ అవర్' ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఓ ఆలోచన కథగా మారి సినిమాగా రావాలంటే ఎంతో మంది మార్చలం, వ్యయ ప్రయాసలు అవసరం. కానీ రచయితకు వచ్చిన ఆలోచనను దర్శకుడు నేర్పుగా తెరకెక్కిస్తేనే ప్రేక్షకులు ఆ సినిమాకి దగ్గరవుతారు. ఇప్పుడున్న ట్రెండ్‌కి అనుగుణంగా ఓ సినిమా తీయాలంటే కత్తి మీద సామే. ఎందుకంటే నేటి తరం ప్రేక్షకులు దర్శకుల ఆలోచనను అర్థక్షణంలోనే పట్టేస్తున్నారు. అందుకేనేమో ఇప్పటి దర్శకులు తమ సినిమాలలో వైవిధ్యానికి పెద్ద పీట వేస్తున్నారు. అటువంటి వారిలో హాలీవుడ్ దర్శకులు కాస్త ముందుంటారనే చెప్పాలి. ఆ కోవకు చెందిన వాటిలో వచ్చినదే దర్శకుడు ఫిలిప్ నాయిస్ తీసిన 'ది డెస్పరేట్ అవర్' సినిమా. ఈ సినిమాని ఈయన 2021లోనే తీశారు. ఈ చిత్రం విడుదల తరువాత భారతదేశంలో చాలా సినిమాలు ఇదే పంథాలో వచ్చినా పెద్దగా గుర్తింపు రాలేదు. ఈ సినిమా నిజానికి ఓ బ్యూటిఫుల్ క్రాఫ్ట్ అని చెప్పవచ్చు. మరీ ముఖ్యంగా కొత్తగా సినిమా తీయాలనుకునే ఔత్సాహికులకు ఇదో చక్కటి పాఠం లాంటిది. ఇక థ్రిల్లింగ్ జోనర్ ఇష్టపడే ప్రేక్షకులకు ఇదో కన్నుల పండగలాంటిది. అంతలా ఏముందీ సినిమాలో ఓసారి చూద్దాం. అమీకార్ తాను రోజూ వెళ్ళే జాగింగ్‌కి రెడీ అవుతుంది. ఇంతలో ఇంట్లో తన కొడుకు నోవా బెడ్ రూమ్‌లోనే బద్ధకంగా పడుకుండడం చూసి ఈ రోజు హెల్త్ బాగా లేకపోతే స్కూల్‌కి వెళ్ళవద్దు అని చెప్పి జాగింగ్‌కు బయలుదేరుతుంది. జాగింగ్‌లో అమీకార్ ఎప్పుడూ హెడ్ ఫోన్స్ పెట్టుకునే వెళుతుంది. కొంత సమయం జాగింగ్‌లో గడిచాక నోవా స్కూల్ నుండి ఓ ఫోన్ వస్తుంది. ఓ ఆగంతకుడు గన్‌తో స్కూల్‌లో చొరబడ్డాడని, పెద్ద ప్రమాదం జరగబోతోందని స్కూల్ ప్రిన్సిపల్ చెబుతుంది. ఇంతలో మరో ఫోన్ కాల్ ద్వారా తన కొడుకు నోవా స్కూల్‌కి వెళ్ళాడని, సరిగ్గా ఆ ఆగంతకుడి చేతికి చిక్కాడని తెలుస్తుంది. అమీకార్ ఆ సమయంలో స్కూల్‌కి చాలా దూరంలో జాగింగ్ చేస్తుండడంతో ఏం చేయాలో తెలియక టాక్సీకి కబురు పెడుతుంది. టాక్సీ రావడానికి చాలా సమయం పడుతుండడంతో కంగారు పడుతుంది. ఇక అక్కడి నుండి అమీ తన దగ్గరున్న ఫోన్‌తో కొడుకును కాపాడుకుంటుందా? లేదా అన్నదే సినిమా. ఇక్కడ విషయం ఏమిటంటే తొంభై శాతం అమీ జాగింగ్‌లోనే సినిమా నడుస్తుంది. సినిమాలో ఇంకెవ్వరూ కనిపించరు. భారీ తారాగణంతో, బీభత్సమైన విజువల్స్‌తో గ్రాండియర్ ఫీస్ట్‌తో తీసిన సినిమాలు కనీసం కాసులు కూడా రాల్చలేని నేటి రోజుల్లో ఒక్కటంటే ఒకే పాత్రతో 84 నిమిషాల నిడివితో సినిమాని తీసిన ఈ దర్శకుడికి నిజంగా హ్యాట్సాఫ్ చెప్పాలి. ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతున్న ఈ సినిమాని మీరు కూడా చూసేయండి. మస్ట్ వాచ్ ఇట్.

– హరికృష్ణ ఇంటూరు